క్లుప్తంగా

వేసవిలో సమృద్ధిగా తాగునీరు



వేసవి జలాశయాన్ని సందర్శించిన ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా పూర్తిస్థాయిలో మంచినీటిని అందించగలిగే సామర్థ్యం ఉందని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. మంగళవారం ఆయన వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి అరట్లకట్ట వేసవి జలాశయాన్ని సందర్శించి అధికారులతో చర్చించారు. ఏప్రిల్ 25వ తేదీ వరకు గోదావరి జలాలతో వేసవి జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకొనే అవకాశం ఉందన్నారు. కాకినాడ ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు అందించేందుకు అరట్లకట్టలో 1582 ఎంఎల్‌డీ, సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్‌లో 832 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉందన్నారు. మరమ్మతుల కోసం కాలువలను మూసి జూన్‌లో తిరిగి తెరిచే వరకు నీటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉంటుందని ఏడీసీ చెప్పారు. ఈ సందర్భంగా వాటర్స్ వర్క్స్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వెంట వాటర్‌వర్క్స్ డీఈ ప్రభాకర్ ఉన్నారు.

కనీస వేతనాలు అమలుచేయండి



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్‌కు వినతిపత్రం ఇచ్చిన సీఐటీయూ నాయకురాలు బేబీరాణి

కాకినాడ క్రైం: కనీస వేతనాల అమలుపై ఆశా వర్కర్లు నిరసనకు దిగారు. మంగళవారం కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భాగంగా సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ఆశావర్కర్ల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో రక్షణ కల్పించి, దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. వందలాదిగా వచ్చిన ఆశా కార్యకర్తలు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా కాకినాడ త్రీ టౌన్ పోలీసులు వారిని బారికేట్లు అడ్డుపెట్టి నిలువరించారు. అనంతరం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌కు సీఐటీయూ నాయకులు బేబిరాణి, నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, దువ్వ శేష బాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, పలివెల వీరబాబు ఆశాకార్యకర్తల సమస్యలను నివేదించారు. తమ విన్నపాన్ని ప్రభుత్వానికి పంపాలని కోరారు.

పోలీసుల అదుపులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు

బోట్‌క్లబ్: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేసి కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులను ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కథనం ప్రకారం టూటౌన్ సమీపంలో శివదుర్గ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఈ నెల 24న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నాగూల్‌మీరా తనిఖీ చేశారు. వంట నూనె బాగా రంగుమారి పోవడంతో కేసు నమోదు చేశారు. తాను లేని సమయంలో వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ తనిఖీ చేసిన ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా, చంపేస్తానని బెదిరించడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బెదిరింపులకు పాల్పడిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు శివను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాయక్ తెలిపారు.

లాభాలబాటలో వేములవాడ పీఏసీఎస్



మహాజనసభలో మాట్లాడుతున్న సీఈఓ వెంకటేశ్వరరావు

కరప: మండలం వేములవాడ సొసైటీ (పీఏసీఎస్) పరిధిలోని రైతులు, కౌలు రైతులకు సకాలంలో రుణాలు అందించి, లాభాలబాటలో నడిపిస్తున్నట్టు ఆ సంఘం సీఈఓ నల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘ పరిధిలో 1,400 మంది రైతులు సభ్యులుగా ఉండగా వారికి పంట రుణాలుగా రూ.3.75 కోట్లు, లాంగ్‌టర్మ్ లోన్లుగా రూ.2 కోట్లు, షార్ట్ టర్మ్ ఇతర రుణాలుగా మరో రూ.2 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ.21 లక్షలు లాభాలు ఆర్జించినట్టు ఆయన చెప్పారు. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకూ జరిపిన జమాఖర్చులు సీఈఓ వెంకటేశ్వరరావు వినిపించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్, ప్రత్యేకాధికారి పి.ఉమాశంకరరావు, అడబాల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాసేవకు స్వస్తి

- మూతపడ్డ ఏయూ దూరవిద్యాకేంద్రం
- ఆన్‌లైన్‌లో సంప్రదించాలంటున్న అధికారులు
- సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రంగా ఉండే విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కొనసాగించాలంటున్న అభ్యర్థులు



మూతపడ్డ ఏయూ దూరవిద్యా కేంద్రం

బాలాజీచెరువు: గురువు లేని విద్య గుడ్డి విద్య అంటారు. అలాగే ఎవరైనా ఏదైనా ఒక అంశాన్ని మౌఖికంగా వివరించేదానికి, ఫోన్ ద్వారానో, మరో మాధ్యమం ద్వారానో అరకొరగా అర్థం చేసుకున్న సమాచారంతో ముందడుగు వేయడానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే వర్సిటీలు వాటి విద్యాసేవలు విస్తృతం చేయడానికి దూర విద్యా కేంద్రాలను పలు కళాశాలల్లో ఏర్పాటు చేశాయి. ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. విద్యా సేవే పరమావధిగా పనిచేసే వర్సిటీలు సేవా మార్గాన్ని వదిలి ఆర్జనే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. సేవలకు స్వస్తి చెప్పి కాసుల వేటలో పరుగులు పెడుతున్నాయి.

ఏ విద్యార్హతల లేకుండా 18 ఏళ్లు నిండిన వారు డిగ్రీ, పీజీ డిప్లమో చేయాలనుకునే వారికి సేవలు అందిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం సేవలకు స్వస్తి పలికింది. విశాఖలో ఉన్న ఈ వర్సిటీ దూర విద్యాకేంద్ర ఆధీనంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1972 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మూసివేయడంతో అడ్మిషన్ కోసమో లేదా పరీక్షల ఫీజు దరఖాస్తు స్వీకరణ, హాల్ టికెట్ల జారీ, పరీక్ష కేంద్రం వివరాల సమాచారం తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ కేంద్రం ద్వారా జూన్, మే నెలల్లో జారీ చేసే నోటిఫికేషన్ ద్వారా డిగ్రీ విభాగాల్లో 4 వేల మంది, పీజీలో 1500 మంది అడ్మిషన్లు పొందేవారు. వీరందరికీ సమాచారం కోసం ఈ స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి ముగ్గురు సిబ్బందిని ఏర్పాటు చేసి సేవలు అందించేవారు. వీరిని విశాఖలోని ఏయూ కేంద్రానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేంద్రం సేవలు ఉదయం 9 నుంచి12 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ నిర్వహిస్తూ అడ్మిషన్ల వివరాలు, సమాచారం తెలియజేసేవాళ్లు. మార్చి నెల వస్తే పరీక్షల ఫీజులు చెల్లించేవారితో స్టడీసెంటర్ కళకళలాడేది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మూసివేయడంతో వెలవెలబోతోంది. సిబ్బందిని అడిగితే దూరవిద్య సేవలన్నీ ఆన్‌లైన్ చేశామంటున్నారని, ఎంత ఆన్‌లైన్ చేసినా ఒక వ్యక్తి ఉండి సందేహాలను నివృత్తి చేసే సాటి రాదని, అభ్యర్థుల అసౌకర్యాన్ని గుర్తించి ఈ కేంద్రాన్ని కొనసాగించాలని వారు కోరుతున్నారు.

అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే...



స్టడీసెంటర్‌కు సంబంధించి అన్ని సేవలు ఆన్‌లైన్‌లో ఉండటంతో ఈ కేంద్రాన్ని తొలగించారు. పరీక్ష పీజు, అడ్మిషన్ అన్ని ఏయూ వెబ్‌సైట్‌లో ఉండటంతో పాటు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటుచేసి సమాచారం అందజేస్తున్నారు.అన్ని జిల్లాల్లో ఉన్న స్టడీ సెంటర్లు తొలగించారు. ఉన్నత అధికారుల అదేశాల మేరకూ సిబ్బంది విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్లిపోయాము.

–ఎస్.నూరిబాబు, స్టడీ సెంటర్ ఇన్‌చార్జ్, ఏయూ

మహిళల ఆర్థికవృద్ధే సీఎం జగన్ లక్ష్యం



ఆసరా చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చంద్రకళాదీప్తి, శివప్రసన్న



సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వైఎస్సార్ ఆసరా సంబరాలు

కాకినాడ: మహిళల ఆర్థిక పురోభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జగన్నాథపురంలో మంగళవారం 14 నుంచి 19వ డివిజన్ వరకు ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా పంపిణీ చేశారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, మాజీ కార్పొరేటర్లతో పాటు ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి మహిళ లక్షాధికారి కావాలని మహానేత వైఎస్సార్ ఎంతో కాంక్షించారని, ఆయన ఆశయాలను తనయుడు జగన్ అమలుచేస్తున్నారన్నారు.

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని, సీఎం జగన్ ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేస్తూ మూడో విడత రుణమాఫీ చేశారన్నారు. కొడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ మహిళలు తలెత్తుకుని తిరిగేలా అన్ని రంగాలలో అగ్ర పీఠం వేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ మహిళా పక్షపాతి సీఎం జగన్ రాజకీయంగా పదవుల్లో ప్రాధాన్యం నుంచి అన్ని ప్రభుత్వ పథకాల అమలులో మహిళలకే గౌరవం కల్పిస్తున్నారన్నారు. ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ మూడో విడత ఆసరా ద్వారా ఆరు డివిజన్ల పరిధిలో 493 సంఘాలకు రూ 3.65 కోట్లు, కార్పొరేషన్ పరిధిలో రూ.28 కోట్లు లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల సమక్షంలో ప్రజా ప్రతినిధులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వృద్ధుల ఫిర్యాదులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రం

- ఆర్డీవో బీవీ రమణ
- ట్రిబ్యునల్ ద్వారా సత్వర పరిష్కారం



హెల్ప్‌లైన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రమణ, తదితరులు



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: వయోవృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, తొలి దశలో కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా డివిజన్ స్థాయిలో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీవో బీవీ రమణ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయ సమావేశ మందిరంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కౌన్సెలింగ్ ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు ఉంటారని, ఈ కేంద్రం ద్వారా వారంలో ఒకరోజు సేవలు అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వి.కామరాజు మాట్లాడుతూ సమన్వయ శాఖల అధికారులతో కలిసి చట్టపరంగా వృద్ధులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ మనల్ని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను బాగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్, 104 సేవలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు తదితరాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్ రమేష్ వివరించారు. హెల్పేజ్ ఇండియా ప్రతినిధి పి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంలోని వివిధ సెక్షన్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ డివిజన్ స్థాయి ట్రిబ్యునల్‌కు ఆర్డీవో చైర్‌పర్సన్‌గా ఉంటారని, అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు కలెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉంటారన్నారు. జాతీయ వయోవృద్ధుల హెల్ప్‌లైన్ 14567 కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం (పెద్దాపురం) అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి, డివిజనల్ ట్రిబ్యునల్ మెంబర్ ఆర్.రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఆర్డీఓ బీవీ రమణ అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ అట్రాసిటీ కేసుల క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు సాయం చేస్తామని అన్నారు. డివిజన్ పరిధిలో ఎమ్మార్వోలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి జాప్యంలేకుండా సంబంధిత తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స అండ్ మానిటరింగ్ సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు.

మొదటిగా కాకినాడ డివిజన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, వాటి పురోగతి, బాధితులకు సహాయం పంపిణీ, ఉపాధి కల్పన, కుల ధ్రువీకర పత్రాల మంజూరు, గత సమావేశ నిర్ణయాలు తదితర అంశాలపై సమావేశం చర్చించారు. సమావేశానికి వచ్చిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ మోకా పవన్‌కుమార్, బండి వీరలింగేశ్వరరావు, పిల్లి జ్యోతి, గంగవంసం త్రినాథ్‌దేవ్‌లు పలు అంశాలను సమావేశంలో లేవనెత్తారు. సమావేశంలో డివిజన్‌స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సాపే సుధాకర్, సిద్ధాంతపు రాజు, వివిధ మండలాల తహసీల్దార్లు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

కూరాడలో చోరీ

రూ.లక్ష విలువైన సొత్తు అపహరణ

కరప: తిరుమల తీర్థయాత్రకు వెళ్లిన స్థానిక కుటుంబానికి చెందిన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ నౌడు రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. కూరాడ గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ వాసంశెట్టి గోవిందరాజులు ఈనెల 13న కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. గోవిందరాజులు ఇంటిపై అంతస్తులో అమ్మమ్మ కాదా నారాయణమ్మ నివాసముంటోంది. ఆమెకు తోడుగా బాధితుని చిన్నమ్మ మేడిశెట్టి కృష్ణవేణి రాత్రి సమయంలో పడుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన ఉదయం లేచిన తర్వాత కృష్ణవేణి చూసేసరికి గోవిందరాజులు ఉండే ఇంటికి వేసిన తాళాలు బద్దలు కొట్టి ఉండగా, ఇంటిలోని సామాను చిందరవందరగా పడి ఉన్నట్లు గుర్తించి, తిరుపతిలో ఉన్న గోవిందరాజుకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసి గొలుసు, మంగళసూత్రాలు, ఉంగరాలు వంటి ఆభరణాలు దొంగలు అపహరించినట్టు గుర్తించారు. ఈ మేరకు రూ.లక్ష విలువచేసే బంగారు ఆభరణాలు, కొంతనగదు దొంగలు తీసుకు వెళ్లినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కోసం ఆర్థిక సాయం



సతీష్‌కు చెక్ అందజేస్తున్న డాక్టర్ వెంకటరమణ

కాకినాడ క్రైం: పేదల కోసం కాకినాడ సత్యా స్కాన్ సెంటర్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ ఆర్థిక సాయం అందించారు. శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ సహాయనిధికి ఈ మొత్తాన్ని కేటాయించారు. మంగళవారం చెక్ రూపంలో రూ.25 వేల మొత్తాన్ని శ్రీ యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌కు కాకినాడలోని స్కాన్ సెంటర్‌లో అందజేశారు.

మేలుజాతి పశువులతో ఆదాయ వృద్ధి



వాకాడలో ఏర్పాటుచేసిన లేగదూడల ప్రదర్శన



ప్రథమ బహుమతిని రైతుకు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

కరప: పశు సంవర్ధకశాఖ సూచనల మేరకు మేలు జాతి పశువులను పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని, తద్వారా ఆదాయాన్ని వృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం వాకాడలో మంగళవారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు మాట్లాడుతూ పశుపోషణ, లేగదూడల పెంపకంపై పాడిరైతులకు అవగాహన కల్పించేందుకే ఈ ప్రదర్శన ఏర్పాటుచేసినట్టు తెలిపారు. పశు వ్యాధులకు సంబంధించి ఆర్‌బీకేలలో కానీ, సమీపంలోని పశువైద్యశాలలో కానీ సంప్రదించి మకాంలలో మందులు పిచికారీ చేయాలన్నారు. తర్వాత ఇంజక్షన్లు చేయించాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ ఎం.భవాని మాట్లాడుతూ పాడిరైతులు రూ.500 చెల్లిస్తే మేలు జాతి పెయ్యిదూడల ఉత్పత్తికి కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ చేస్తామన్నారు. దీనిని పశురైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేగదూడల ప్రదర్శనలో 30 మంది రైతులు పాల్గొనగా వరసగా దుగ్గల కృష్ణ, దూడల నారాయుడు, చోడిశెట్టి సత్యనారాయణ, ఆకుల శ్రీరామమూర్తి, ముమ్మిడి అమ్మన్న, సుంకర సుబ్బారావు, దూడల వీరాస్వామిలకు బహుమతులు, మిగిలిన రైతులకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. ఎంపీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల ప్రసాద్, పెంకే సత్తిబాబు బహుమతులు అందజేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్ బాబు, వేళంగి పశువైద్యాధికారి పి.అనిల్ విల్సన్, వీఏలు పి.దుర్గాప్రసాద్, ఎం.మణికంఠ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫిష్ ఆంధ్ర’లో తాజా ఉత్పత్తులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నరసన్ననగర్‌లో మినీ అవుట్‌లెట్ ప్రారంభం



అవుట్‌లెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, అధికారులు

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తాజా చేపలు, రొయ్యలు వంటి మత్స్య ఉత్పత్తులను ప్రజలకు అందించేందుకు ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని, ప్రజలు వీటి ద్వారా తాజా చేపల రుచులను ఆస్వాదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. 47వ డివిజన్ నరసన్ననగర్‌లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ పక్కన అవుట్‌లెట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. పీఎంఎంఎస్‌వై కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ అవుట్‌లెట్లు ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు రావాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఒక అవుట్‌లెట్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటితో పాటు రెడీ టూ ఈట్ కింద రెస్టారెంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మత్స్యశాఖ ఏడీ, ఇన్‌చార్జి జేడీ శ్రావణికుమారి, ఎఫ్‌డీఓ నూకరాజు, 47వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు రాజారపు కృష్ణ, ధనరాజు, అవుట్‌లెట్ నిర్వాహకుడు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు దళిత క్రైస్తవుల ధన్యవాదాలు

కాకినాడ రూరల్: దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు సీఎం జగన్‌కు జిల్లాలోని దళిత క్రైస్తవులు ధన్యవాదాలు తెలియజేశారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును పాస్టర్స్ ఫెలోషిప్ సంఘ పెద్దల ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులు పెద్ద ఎత్తున కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవరెండ్ మూర్తిరాజు ఎమ్మెల్యే కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా కాలంగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఉద్యమాలు జరుగుతున్నాయని, ఈ పోరాటం ఒక కొలిక్కి వచ్చిందని భావిస్తున్నానన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా క్రైస్తవ విభాగం అధ్యక్షుడు దడాల జాషువా గిరి, రెవరెండ్ డాక్టరు ఇమాన్యుయేల్, రెవరెండ్ డాక్టరు జోసఫ్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న ఆకాంక్ష..

కాకినాడ: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించడంపై ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంస్థ జిల్లా అధ్యక్షురాలు విజయజాన్ గెడ్డం ఆధ్వర్యంలో పలువురు మంగళవారం బాలాజీచెరువు సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సంతోషం వ్యక్తంచేశారు. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెప్పారు. సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి పాస్టర్ ఎస్.అశోక్, చైర్మన్ డేవిడ్ శామ్యూల్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేమాంలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నేమాంలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం గ్రామంలో వైఎస్ జగన్‌మోహనపురంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో సౌకర్యాలు కలిస్తున్నామన్నారు. సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, అధికారులు నేమాం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల తీరును ఎమ్మెల్యేకు వివరించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, తమ్మవరం ఉప సర్పంచ్ దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని సీఏఏ పరిధిలోకి తీసుకురావాలి



విలేకర్లతో మాట్లాడుతున్న చాప్టర్ అధ్యక్షుడు వీర్రెడ్డి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఆక్వా రంగాన్ని కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) పరిధిలోకి తీసుకురావాలని ఆల్ ఇండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ కాకినాడ చాప్టర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి వేంకటేశ్వరరావు కోరారు. మంగళవారం కాకినాడ రాంకోసాలో అసోసియేషన్ కాకినాడ రీజియన్ చాప్టర్ సభ్యులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆక్వా రంగం ఏర్పాటు కోసం పలు కేంద్ర సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీని వల్ల తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, వాటి నుంచి గట్టెక్కాలంటే ఆక్వా రంగాన్ని సీఏఏ పరిధిలోనికి తీసుకువచ్చి సింగిల్ విండో పథకం అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాలను మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు సత్తి వీర్రెడ్డి మాట్లాడుతూ కాకినాడ తీర ప్రాంతంలో సుమారు 250 నుంచి 300 హేచరీలు ఉన్నాయని వాటి ద్వారా నాణ్యమైన ఉత్పత్తి జరగమే కాకుండా వేలాది మందికి జీవనోపాధి కలిస్తున్నామన్నారు. కొన్ని ప్రభుత్వ విధానాల వల్ల ఈ పరిశ్రమ ముందుకు తీసుకెళ్లడంలో ప్రతిబంధకంగా మారుతున్నాయన్నారు. మన జిల్లా నుంచి మహారాష్ట్ర, ఒడిషా, పశ్చిమ బెంగాల్, కర్ణాటక వంటి రాష్ట్రాలకు కూడా రొయ్య ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. విదేశాలకు కూడా ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారకద్రవ్యం ఆర్జించి ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సభ్యులు బడే విజయ్‌కుమార్, సత్తి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు ఎస్వీఆర్ కుమార్, ఎన్.ప్రభాకరావు, ప్రత్తిపాటి వీరభద్రకుమార్, ఆక్వా రైతులు రఘు, సూర్యారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



పెన్నులు అందుకుంటున్న విద్యార్థులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న వినాయకుని ఆలయం వద్ద మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు బహూకరించారు. తొలుత వినాయకుడి వద్ద పెన్నులు ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి విఘ్నాలు లేకుండా పరీక్షలు రాయాలని ఆకాంక్షతో ఈ పెన్నులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి గోవిందు మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు ఆలయంలో పూజలు చేసిన పెన్నులు అందిస్తున్నామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పార్వతి పాల్గొన్నారు.